కథ



జి. తులసీరాం

# మా ఇంగ్లీషు తల్లికి మల్లెపువ్వు దండ

"సార్... పోస్ట్" అంటూ పోస్ట్‌మ్యాన్ లావాటి కవర్ పడేసి వెళ్ళిపోయాడు. ఉమాచంద్రం ఆత్రుతగా వెళ్ళి ఆ కవర్ అందుకున్నాడు. తీరా చూస్తే అది అతను వ్రాసి పంపిన కథే. తిరిగొచ్చేసింది.

ఉమాచంద్రం కవరు చించి చూసుకున్నాడు. 'అంటే... ఈ కథకు కూడా ప్రచురణకి అర్హతలేదా?' అనుకొని నీరసపడిపోయాడు. నిరాశ చెందాడు. 'నా కథల్లో ఏం లోపముంది? ఎందుకన్నీ తిరిగొచ్చేస్తున్నాయి? ఆ తిప్పి పంపేవాళ్ళు కథ ఎందుకు నచ్చలేదో రెండు వాక్యాల్లో వ్రాసి పంపితే నాలాంటి కొత్త రచయితలకు ఎంతో ఉపయోగపడుతుంది కదా! చేసిన తప్పే మళ్ళీ చేసే ఆస్కారం ఉండదు కదా!! నా రచనలన్నీ ఎందుకు తిరిగొచ్చేస్తున్నాయి? ఈ ప్రశ్నకు సమాధానం ఎవరు చెబుతారు? నేను రచయిత కాగలనా? నాలో ఆ ప్రతిభ ఉందా?'

ఉమాచంద్రానికి ఎక్కడలేని దుఃఖం కలిగింది. రచనలు చేయడం మానేద్దామనుకున్నాడు. వెంటనే అతనికి తండ్రి గుర్తుకువచ్చాడు.

ఉమాచంద్రానికి ఇష్టం లేకపోయినా వేలకు వేలు ఫీజులు కట్టి అతన్ని కార్పొరేట్ కాలేజీ యంబిఏలో జాయిన్ చేసాడు. చంద్రానికి కంపెనీల పుట్టుపూర్వోత్తరాల గూర్చి చదువుతోంటే చప్పగా అనిపించింది. 'ఎప్పుడు ఇక్కడి నుండి పారిపోదామా?' అని ఆలోచించసాగాడు. ఆ విషయమే స్నేహితులతో చెప్పాడు.

వాళ్ళు "ఇక్కడి నుండి వెళ్ళిపోయి ఏం చేస్తావు?" అనడిగారు.

"కథలు, నవలలు వ్రాస్తాను" ఉమాచంద్రమన్నాడు.

"అదేదో ఇక్కడుండి కూడా చేయచ్చుకదా! యంబిఏ చదివి మంచి ఉద్యోగం సంపాదించు. జాబ్ చేస్తూ కథలు వ్రాసుకో!"

"ఈ యంబిఏ నేను చదవలేను. ఇక్కడ గాలి పీల్చుకోవడం కూడా నాకు కష్టంగా ఉంది! చెప్పాలంటే "నేను ఏ ఉద్యోగం చేయలేను. కూర్చొని చదవడం, వ్రాయడం తప్ప!!"

వాళ్ళు బల్లగుద్ది "అప్పుడు నీకు తిండెవరు పెడతారు?" అనడిగారు.

"నా పాఠకులు... మొదట కొంచెం కష్టంగానే ఉంటుందని నాకూ తెలుసు. ఏదో చిన్న ఉద్యోగం చేస్తూ వ్రాయడం మొదలెడతాను. కొన్ని నెలలకు నా పేరు పాఠకుల నోట్లో నానుతుంది. కొంచెం డబ్బులు రావడం కూడా మొదలవుతుంది. అప్పుడు ఉద్యోగం మానేసి రచనకి అంకితమైపోతాను!"

వాళ్ళు విసుక్కుంటూ "నీ ఖర్మ! గుర్రాన్ని చెరువు దగ్గరికి లాక్కెళ్ళచ్చు కానీ దాని దగ్గర బలవంతంగా నీళ్ళు తాగించలేము! నిన్ను మార్చడం మా తరం కాదు. నీ పాట్లు నువ్వు పడు!!" అని వెళ్ళిపోయారు.

ఉమాచంద్రానికి తండ్రి కూడా ఎంబిఏ చదవమని చిలుకకు చెప్పినట్లు చెప్పాడు. అయినా చంద్రం మాట వినిపించుకోలేదు. ఇప్పుడు అనుభవిస్తున్నాడు.

'నేను రచయితగా నిలదొక్కుకోగలనా? నా రచనలో ఉన్న లోపమేమిటి? నేను వ్రాసిన రెండు నవలలు, ఇరవై కథలు అన్నీ తిరిగొచ్చేసాయి. మూడు సంవత్సరాలు నేను పడ్డ కష్టము బూడిదలో పోసిన పన్నీరైయ్యింది. నేనిప్పుడేం చేయాలి?' అని మధన పడసాగాడు ఉమాచంద్రం.

అలా కొంతసేపు గడిపిన తర్వాత అతనికో ఆలోచనొచ్చింది.

'సాహిత్యంపై మంచి పట్టు ఉన్న వారి దగ్గరికెళ్ళి నా రచనలు చదివిస్తే? వారి ద్వారా నా రచనల్లో ఉన్న లోపమేమిటో తెలుస్తుంది కదా! నాకు తెలిసిన వారిలో సాహిత్యంపై పట్టు ఉన్న వాళ్ళెవరున్నారు?' అని కాస్సేపు ఆలోచించాడు ఉమాచంద్రం.

అతనికి గోపాలం గుర్తుకొచ్చాడు. గోపాలం చంద్రానికి గ్రంథాలయంలో పరిచయమయ్యాడు. చంద్రం గ్రంథాలయానికి

*'నేను రచయితగా నిలదొక్కుకోగలనా? నా రచనలో ఉన్న లోపమేమిటి? నేను వ్రాసిన రెండు నవలలు, ఇరవై కథలు అన్నీ తిరిగొచ్చే సాయి. మూడు సంవత్సరాలు నేను పడ్డ కష్టము బూడిదలో పోసిన పన్నీరైయ్యింది. నేనిప్పుడేం చేయాలి?'*

వెళ్ళినప్పుడల్లా గోపాలం అక్కడ కనబడతాడు. 'ఈ అబ్బాయి ఎవరో మంచి సాహిత్యాభిలాషిలా ఉన్నాడు' అనుకొని ఉమాచంద్రమే అతన్ని పరిచయం చేసుకున్నాడు. ఆ తర్వాత రెండు మూడుసార్లు అతని ఇంటిక్కూడా వెళ్ళివచ్చాడు.

'నా రచనల్లో లోపం కనుక్కోవడానికి గోపాలమే సరైన వ్యక్తి' అని నిర్ధారించుకున్నాడు ఉమాచంద్రం. వెంటనే అతను వ్రాసిన నవలలు, కథలు పట్టుకొని గోపాలం ఇంటికి బయలుదేరాడు. చంద్రం మరో అరగంటకి స్నేహితుని ఇల్లు చేరుకున్నాడు.

గోపాలం చంద్రాన్ని కూర్చోపెట్టి "వ్వాట్ ఎ సర్‌ప్రైజ్! ఏంటి ఇంత అకస్మాత్తుగా ఇలా వచ్చావు? నువ్వు రావాలంటే నేను నిన్ను బతిమాలాలిగా!"

చంద్రం మొహమాటంగా "అవసరమొచ్చింది. అందుకే హడావిడిగా ఇలా వచ్చాను!"

"భాయి... ఏమిటా అవసరం? చెప్పు... నా వల్ల వీలైనంత చేస్తాను!"

"గోపాలం... నీకు నేను మునుపెప్పుడూ చెప్పలేదు! నేను కథలు వ్రాస్తాను!!"

గోపాలం కూర్చున్న కుర్చీలో ఎగిరిపడ్డాడు. "భాయి... నువ్వు కథలు వ్రాస్తావా?!

ఆశ్చర్యంగా ఉందే! ఇంతకుమునుపు నాకెందుకు చెప్పలేదు? ఎందుకు రహస్యంగా ఉంచావు?"

"కథలే కాదు గోపాలం, రెండు నవలలు కూడా వ్రాసాను!"

"అమ్మ బాబోయ్... నవలలే?! ఎందుకు భాయి చెప్పనేలేదు?"

"ప్రచురితమైన తర్వాత చెబుదామనుకున్నాను. కానీ ఆ అవకాశమే రాలేదు!"

"అయ్యో... అలానా? అయితే నన్ను ఇప్పుడు ఏం చేయమంటావు?"

ఉమాచంద్రం హ్యాండ్‌బ్యాగు నుండి అతను రచించిన నవలలు, కథలు బయటకి తీసి గోపాలానికిస్తూ "దీన్ని కాస్త చదివి తప్పులెక్కడ వ్రాసానో నాకు చెబితే ఎంతో మేలు చేసినవాడివవుతావు!" అన్నాడు. గోపాలం చంద్రం రచనలు అందుకుంటూ

"భాయి... ఇంతేనా? తప్పకుండా చదివి చెబుతాను!

***"చిక్కుల్లో పడేసావే! నీ భాష చాలా అద్భుతంగా ఉంది. ఇంత కమ్మటి తెలుగు వ్రాస్తావనుకోలేదు. నవల్లో కానీ, కథల్లో కానీ ప్లాటు, శైలి, శిల్పం ఎంతో చక్కగా ఉంది! నీ రచన సృజనాత్మకంగా ఉంది. ఇటువంటి రచనలు నేను ముందెన్నడూ చదవలేదు! తెలుగు కానీ... ఇంగ్లీషు కానీ..."***

నువ్వేమీ కంగారుపడకు!"

చంద్రం 'వచ్చిన పని అయిపోయింది' అన్నట్లు కుర్చీ నుండి పైకి లేచి - "మళ్ళీ ఎప్పుడు వచ్చి కలవమంటావ్?" అనడిగాడు.

"భాయి..." అని క్షణంపాటు ఆలోచించి "ఒక నాలుగు రోజుల తర్వాత వచ్చి కలువు" అన్నాడు. చంద్రం "సరే" అని అక్కడి నుండి బయటపడ్డాడు.

నాలుగు రోజుల తర్వాత ఉమాచంద్రం గోపాలం ఇంటికెళ్ళాడు.

"భాయి.. వచ్చావా? నీ కోసమే ఎదురుచూస్తున్నా!"

చంద్రం ఆత్రంగా "గోపాలం నా రచనలన్నీ చదివావా? ఎలా ఉంది? ఎందుకు ప్రచురణ కాలేదంటావు?" అనడిగాడు.

"భాయి... నీ రచనలు అద్భుతంగా ఉన్నాయి. ఇంత బాగా వ్రాస్తావనుకోలేదు. చాలా బాగుంది. కానీ ఎందుకు ప్రచురితం కాలేదో నాకూ అర్థం కావడం లేదు!"

ఉమాచంద్రం నీరస పడిపోతూ "అలా అనకు గోపాలం... నీపై చాలా ఆశలు పెట్టుకొని వచ్చాను! నువ్వే నా ఆపద్బాంధవుడవు! ఏదో ఒకటి చెప్పు గోపాలం!!" అన్నాడు.

"చిక్కుల్లో పడేసావే! నీ భాష చాలా అద్భుతంగా ఉంది. ఇంత కమ్మటి తెలుగు వ్రాస్తావనుకోలేదు. నవల్లో కానీ, కథల్లో కానీ ప్లాటు, శైలి, శిల్పం ఎంతో చక్కగా ఉంది!

నీ రచనలు సృజనాత్మకంగా ఉన్నాయి. ఇటువంటి రచనలు నేను ముందెన్నడూ చదవలేదు! తెలుగు కానీ... ఇంగ్లీషు కానీ..."

"అంత బాగా ఉన్నప్పుడు ప్రచురితం ఎందుకు కాలేదు?"

"భాయి... అదే అర్థం కాకుండా ఉంది!"

"పోనీ... ఈ విషయం చెప్పు గోపాలం... నేను రచయితగా నిలదొక్కుకోగలనా?

అంటే... నేను రచనలు చేయడానికి పనికొస్తానా?"

"అలాగంటావేం భాయి? నేను నువ్వు రచనలు చేయడానికే పుట్టావనుకుంటాను! నీ రచనల్లో ఉన్న లోపమేమిటో తెలుసుకోవడానికి ఒక సలహా చెప్తాను. చేస్తావా?"

ఉమాచంద్రం దృఢంగా "చెప్పు గోపాలం... నేను ఏమి చేయడానికైనా సిద్ధంగా ఉన్నాను!" అన్నాడు.

"నీకు పాపులర్ రచయిత ఆప్లోద్ తెలుసా?"

"ఆప్లోద్‌ని తెలియనివాళ్ళు ఎవరుంటారు?"

"ఒక పని చేయి... నీ రచనలన్నీ పట్టుకొని ఆయన దగ్గరికెళ్ళు! ఆయన నీకు





తప్పకుండా సహాయం చేస్తాడు!"

ఉమాచంద్రం అనుమానంగా "ఆయన నా గోడు వింటాడంటావా?" అనడిగాడు.

"భాయి... ఆయన చాలామంది క్రొత్త రచయితలకు సహాయం చేసాడని విన్నాను. నీక్కూడా తప్పకుండా సహాయం చేస్తాడు."

"థాంక్స్ గోపాలం... నీ మేలు జన్మలో మరచిపోలేను!"

గోపాలం నవ్వి "ఈ మాత్రానికే?" అనడిగాడు.

ఉమాచంద్రం ఆప్లోద్ వద్ద అపాయింట్‌మెంట్ తీసుకున్నాడు.

మరో వారం రోజుల తర్వాత అతన్నెళ్ళి కలిసాడు. చంద్రం ఎదుర్కున్న సమస్య గూర్చి అతనికి వివరంగా చెప్పాడు. ఉమ మాటలు విన్న ఆప్లోద్ "అయితే నీ రచనలు చదివి లోపమెక్కడుందో చెప్పమంటావు!" అన్నాడు.

"అవును సార్" "సరే" నువ్వెళ్ళి ఒక నెలరోజుల తర్వాత కనిపించు".

చంద్రం గుండెలపైన చెయ్యి వేసుకుంటూ "అమ్మో నెలరోజులా?!" అనడిగాడు.

"చూడు చంద్రం... నీ తొందరపాటు నేను అర్థం చేసుకోగలను. నేను కూడా ఇప్పుడు నువ్వున్న స్టేజీ నుండి పైకొచ్చినవాడినే! నాకూ చాలా పనులున్నాయి. నువ్వు కొంచెం ఓపిక పట్టాలి!"

ఉమకి ఇక చేసేది ఏమీ లేక "సరే సార్... నెలరోజుల తర్వాత మళ్ళీ వచ్చి కనబడతాను!" అని ఆహ్లాద్‌కి నమస్కారం పెట్టి అక్కడి నుండి బయటపడ్డాడు. ఉమాచంద్రం ఎప్పుడెప్పుడు నెలరోజులు పూర్తవుతుందా, ఎప్పుడెప్పుడు వెళ్ళి ఆహ్లాద్‌ను కలుద్దామా అని ఎంతో ఎదురుచూసాడు. మొత్తానికి ఆ రోజు రానే వచ్చింది.

చంద్రం టెన్షనుగా ఆహ్లాద్‌ను కలవడానికెళ్ళాడు.

"ఆ... చంద్రం... రావోయ్... నీ కోసమే ఎదురుచూస్తున్నాను... రా...రా... కూర్చో..."

చంద్రం మొహమాటంగా "సార్... నా రచనలు చదివారా?" అనడిగాడు.

"ఇంకానా... ఎప్పుడో! నీ నవలలు, కథలు అన్నీ చదివాను. బావుంది."

ఆహ్లాద్ అలా అనడంతో ఉమకి సంతోషమేసింది. కానీ అతని ప్రశ్నకి సమాధానం దొరకలేదు. "అంత బాగున్నప్పుడు ఎందుకు సార్ ప్రచురితం కాలేదు?"

ఆహ్లాద్ తాపీగా "అది అవ్వదు!" అన్నాడు.

ఉమాచంద్రం పక్కలో బాంబు పడ్డట్లెయ్యింది. క్షణంసేపు అతను విన్నది నమ్మలేకపోయాడు. "సార్... మీరే కదా నా రచనలు అద్భుతంగా ఉన్నాయన్నారు. మరి ఎందుకు ప్రచురితం కాదంటున్నారు?"

"నీ రచనలు నాకు నచ్చాయన్నానేకానీ అందరికీ నచ్చుతుందన్నానా?"

ఉమాచంద్రం తికమకపడుతూ "అందరికీ ఎందుకు నచ్చదు?" అనడిగాడు.

"ఓపిక లేదు! అవును చంద్రం... మనవాళ్ళకి ఓపిక లేదు! రెండు వందల పేజీలు తత్త్వం వ్రాసావు. నవల కాదు... తత్త్వం! ఫిలాసఫీ. ఇంటలెక్చువల్ లెవల్లో బాగానే ఉంటుంది. కానీ సామాన్యుడికి అర్థంకాదు. 'ఎలాగైనా చదవాలి!' అని కంకణం కట్టుకొని కూర్చునేవాళ్ళు ఈ కాలంలో ఎవరున్నారు? ఒకసారి కిటికీ వద్ద కెళ్ళి చూడు... నగరం ఎలా పరుగులు పెడుతోందో! ఎవరి దగ్గరా అంత సమయం లేదు!!"



తెలుగు భాషలో కొన్ని అక్షరాలు, చాలా పదాలు అంతరించిపోయాయి. నిజానికి స్వచ్ఛమైన తెలుగు చచ్చిపోయింది. ఇంగ్లీషు పదాలు వాడాలోయ్! నీ నవల్లో ఎన్ని ఇంగ్లీషు పదాలు వాడితే దానికంత వైటేజ్ ఉంటుంది.నీ రచనల్లో తెలుగు ఎంత వీలైతే అంత తగ్గించేయ్! ఇంగ్లీషు వాడు!!

ఉమాచంద్రం దిగులుగా "అయితే ఇప్పుడు నన్నేం చేయమంటారు?" అనడిగాడు.

"నీ తత్త్వం వదిలేయ్! మనవాళ్ళకి కావాల్సింది తత్త్వం కాదు... మర్డర్స్, సెక్స్, మిస్టరీ... ఇలాంటివే! మర్డర్ మిస్టరీ వ్రాయి... ఎందుకు ప్రచురితం కాదో నేనూ చూస్తాను! రొమాన్స్, శృంగారం వ్రాయి... ఎందుకు కాదో చూస్తాను. నీ నవలల్లో సూపర్ హీరోలను చూపించు. వేలకు వేల కాపీలు అమ్ముడుపోతాయి. ఇంటలెక్చువల్ స్టఫ్ మనవాళ్ళు ఎంజాయ్ చేసే స్టేజీలో లేరు!"

"నా రచనలు ప్రచురింపబడకపోవడానికి అదేనా కారణం?"

"ఇంకా చాలా ఉన్నాయి! అంత అచ్చ తెలుగులో వ్రాస్తే నీ నవలలు ఎవరు చదువుతారోయ్? నాకే ఒకటి, రెండు చోట్ల నిఘంటువు తెరవాల్సొచ్చింది. అలాంటప్పుడు సామాన్య పాఠకుల పరిస్థితి ఎలా ఉంటుందో ఒకసారి ఆలోచించు! తెలుగు భాషలో కొన్ని అక్షరాలు, చాలా పదాలు అంతరించిపోయాయి. నిజానికి స్వచ్ఛమైన తెలుగు చచ్చిపోయింది. ఇంగ్లీషు పదాలు వాడాలోయ్! నీ నవల్లో ఎన్ని ఇంగ్లీషు పదాలు వాడితే దానికంత వైటేజ్ ఉంటుంది. నీ రచనల్లో తెలుగు ఎంత వీలైతే అంత తగ్గించేయ్! ఇంగ్లీషు వాడు!! ఇప్పుడు అదే ఫ్యాషన్. ప్లాట్ కూడా మన సంస్కృతీ, సాంప్రదాయానికి తగ్గట్లు తీసుకోకు! ఎవరూ చదవరు! ప్లాటు కూడా ఇంగ్లీషుదై ఉండాలి. ఏదైనా ఇంగ్లీషు పుస్తకానికి నీ నవల కాపీ అయితే మరీ మంచిది! నీ నవల్లో గాలి, నీరు, నిప్పు, ఆకాశం, రుచి, వాసన, వాతావరణం, అరటిపండు తొక్క అన్నీ ఇంగ్లీషుదై ఉండాలి. అప్పుడే ప్రజలు చదవడానికి ఇష్టపడతారు. తెలుగు భాష, సంస్కృతి, సాంప్రదాయం అన్నీ చనిపోయాయి నేస్తం. దే ఆర్ నో మోర్!"

ఆహ్లాద్ చెప్పింది ఉమకి నమ్మశక్యం కాకుండా ఉంది.

"ఇంగ్లీషు నవలని కాపీ కొడితే ప్రజలు ఊరుకుంటారా? సమస్యలు ఎదురవ్వవా?"

"పిచ్చినాయనా... ముందుమాటలో ఫలానా ఇంగ్లీషు పుస్తకాన్ని ప్రేరణగా తీసుకొని ఈ నవల వ్రాసాను అన్నావనుకో... జనాలు ఎగబడి కొంటారు. ఇప్పుడు తెలుగు ఎవరికీ అక్కరలేదు. అది పుస్తకమైనా కానీ గొర్రె బొచ్చైనా కానీ... ఎందులోనైనా ఇంగ్లీషుంటేనే దానికి వైటేజీ!"

"మీరు చెప్పినట్లు చేయడం నాకు ఇష్టం లేకపోతే?"

"పాపులర్ రచయిత కావాలన్న ఆశలు వదులుకో! రచనలు మానేసి ఏదైనా పని చేసుకో... బాగుపడతావ్!!"

***

అది ఉమాచంద్రం సన్మాన సభ.

చంద్రం వ్రాసి ప్రచురితమైన మొదటి నవల తెలుగు పాఠకులను ఉక్కిరిబిక్కిరి చేయడంతో అతనికి సన్మానం ఏర్పాటు చేసారు. చంద్రం పాపులర్ ఇంగ్లీషు నవలను కాపీ కొట్టాడు. కాపీ కొట్టడమంటే అక్కడక్కడా ఇంగ్లీషు పదాలు తీసేసి తెలుగు పదాలు చేర్చాడు. అంతే! అతని నవల పెద్ద హిట్ అయ్యింది. పుస్తకం మార్కెట్‌లోనికి వచ్చిన వారం రోజుల్లోనే అన్ని కాపీలు అమ్ముడుపోయాయి. నవల మళ్ళీ ముద్రించాల్సొచ్చింది. చంద్రం నవల పాఠకుల్లో అంత క్రేజ్ పుట్టించింది. కాబట్టి అతనికి సన్మానం.

సభలో జనం ఇసుక చల్లితే రాలనంతగా క్రిక్కిరిసి ఉన్నారు. కార్యక్రమం మొదలయ్యింది. మొదట ప్రముఖ క్రిటిక్ నిహ్లాని మాట్లాడుతూ "చంద్రం నవల అదిరిపోయింది. నాకు అచ్చు ఇంగ్లీషు నవలే చదువుతున్నట్లనిపించిందంటే ఎంత గొప్పగా ఉందో మీరే ఊహించుకోండి. ఆ శైలి, శిల్పం అచ్చు ఇంగ్లీషువాళ్ళదే. ఆ వాతావరణం ఇక చెప్పనక్కరలేదు. చంద్రం పుస్తకం చదువుతోంటే నాకు న్యూయార్క్‌లో ఉన్నట్లే ఉంది.ఇలాంటి పుస్తకం చాలా అరుదుగా వస్తూంటుంది. ఇక్కడున్న వారిలో చంద్రం నవల ఇంకా చదవనివారుంటే వాళ్ళంత దురదృష్టవంతులు భూమండలంలోనే లేరు!" ఇలా నిహ్లాని ఒక అర గంట లెక్చరిచ్చి కూర్చున్నాడు.

ఆ తర్వాత చంద్రం నవల ప్రచురణకర్త మాట్లాడాడు "ఉమాచంద్రం అనబడే ఈ కుర్రాడు ఇంగ్లీషు నవలని ప్రేరణగా తీసుకొని తన రచన చేసాడు. ఇది మన తెలుగుతల్లికే గర్వకారణం. ప్రతి తెలుగువాడు ఎంతగానో గర్వించదగ్గ విషయం. ఒక పాపులర్ ఇంగ్లీషు పుస్తకాన్ని తెలుగులో చదువుకునే అవకాశం చిక్కినందుకు మనం పూర్వజన్మలో గొప్ప పుణ్యం చేసుండాలి.ఇది మన పూర్వజన్మ సుకృతం" అంటూ ఆయన మరో అరగంట అనర్గళంగా మాట్లాడేసాడు.

ఇలా ఒకరి తర్వాత ఒకరు రెండు గంటలపైగా మాట్లాడేసిన తర్వాత ఉమాచంద్రానికి శాలువా కప్పి మొమెంటో ఇచ్చారు. సభలో ఉన్న ఒకరొక్కరే వచ్చి చంద్రం పక్కన నిలబడి ఫోటోలు తీసుకున్నారు. కొందరు ఉమ భుజం తట్టి చేయివేసి మరీ ఫోటోలు దిగారు. ఆ యువ రచయిత ఆటోగ్రాఫ్ కోసం పాఠకులు 'క్యూ' కట్టారు. చంద్రానికి అన్ని సంతకాలు పెట్టి చేయి నొప్పి పుట్టింది.

అతనికి ఆ జనం, ఆ కోలాహలం నుండి తప్పించుకొని బయటకి రావటానికి గంటపైనే పట్టింది. ప్రముఖ క్రిటిక్ నిహ్లాని అతన్ని కారులో తీసుకెళ్ళి ఇంటిదగ్గర దింపాడు.

ఉమాచంద్రం నిహ్లానికి "గుడ్‌నైట్" చెప్పి పంపించేసాడు. అతనికి అంతా అయోమయంగా ఉంది. 'ఒక ఇంగ్లీషు నవలను కాపీ కొట్టినందుకు ఇంత క్రేజా?!' చంద్రానికి ఆహ్లాద్ మాటలు గుర్తుకొచ్చాయి. అతను మనసులో అనుకోబోయి అప్రయత్నంగా పైకే అనేసాడు "తెలుగు భాష చచ్చిపోయింది!!!"